క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం



తెనాలిటౌన్: నాజర్‌పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో సోమవారం వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు ఎం.సాయికృష్ణ సహకారంతో ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. యోగా సభ్యులు ఆశ్రమాల్లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడం అభినందనీయమని ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య పేర్కొన్నారు. సాంబ్రాజ్యం, అనూష, ఆశ్రమ నిర్వాహకులు మురళీ, భారతి, యోగసాధకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యం



కొల్లిపర: ప్రతి మహిళ గృహంలో, పరిసరప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచినప్పుడే ఆకుటుంబంలోని సభ్యులు ఎటువంటి రోగాలు లేకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారని ఏపీఎంఎఎస్ఎస్ జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలు, మహిళలకు నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై పూర్తి అవగాహన కలిగి తగు జాగ్రత్తలు పాటించటం వలన అంటు రోగాలు లేని సమాజం ఏర్పడుతుందని అన్నారు. ఏపీఎం ప్రియదర్శిని, సీసీలు, అకౌంటెంట్, వీఓఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



తెనాలిటౌన్: పట్టణ ఐతానగర్‌లోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో సోమవారం నోటుబుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిల్‌లు పంపిణీ చేశారు. క్లబ్ వ్యవస్థాపకుడు కాకరపర్తి సుబ్రమణ్యం, క్లబ్ అధ్యక్షుడు సాతులూరి రామ్ ప్రసాద్‌లు నోట్ బుక్స్ పంపిణీ అనంతరం మాట్లాడారు. క్లబ్ సెక్రటరీ నెరేళ్ళ కృష్ణమోహనరావు, వెచ్చా సాంబశివరావు, నంబూరి శ్రీకుమార్, పాదర్తి వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం స్వర్ణలత, ఉపాధ్యాయులు సుజాత, దిలీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు



తెనాలిరూరల్: స్థానిక ఇస్లాంపేటలోని తూర్పు కాల్వకట్ట వెంబడి సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ట్రాన్స్‌ఫార్మర్ కింద వైపున ఉన్న వ్యర్థాలకు నిప్పంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపుచేశారు. సిబ్బంది సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్కన పడి ఉన్న వ్యర్థాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

మంగళగిరి: నగరంలోని సీకే జూనియర్ కళాశాలలో సోమవారం మాదక ద్రవ్యాల వ్యసనం.. కుటుంబంపై ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత, ఉపాధ్యాయురాలు ఎస్.శ్వేత, బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షధారులకు అన్నదానం

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ప్రతిరోజు అయ్యప్ప మాలధారులు 90 మందికి నిత్యఅన్నదానం భక్తుల, గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 41రోజుల పాటు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు ఉమాపతిశాస్త్రి పర్యవేక్షించారు.

పథకాల కొనసాగింపు సీఎం జగన్‌తోనే సాధ్యం

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక
- చినరావూరుతోట-1లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: రాష్ట్రాభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెరగని ముద్రవేశారని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 14వ వార్డులోని చినరావూరుతోట-1 సచివాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నవరత్న పథకాల ద్వారా ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిందన్నారు. కమిషనర్ ఎం.జశ్వంతరావు మాట్లాడుతూ పేద ప్రజల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేసి కొనసాగిస్తుందన్నారు. వాటన్నింటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. 14వ వార్డు కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు మాట్లాడుతూ తన వార్డులో ఇప్పటి వరకు రూ.17.13కోట్లతో పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల జాబితా బోర్డును ఛైర్‌పర్సన్ రాధిక ఆవిష్కరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్-1 మద్దాలి శేషాచలం, ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం కన్వీనర్ తిరుమలశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాలు రెండు కళ్లుగా పాలన..

వల్లభాపురం(కొల్లిపర): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో సువర్ణ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం దక్కించుకున్నారని అటువంటి ముఖ్యమంత్రిని రానున్న ఎన్నికల్లో మళ్లీ ఎన్నుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి కోరారు. సోమవారం మండలంలోని వల్లభాపురం గ్రామంలోని సచివాలయం-2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వద్ద ఎంత మందికి ఏయే పథకాల ద్వారా లబ్ధి కలిగిందన్న వివరాలతో కూడిన సంక్షేమ అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయం-2లో నాలుగున్నరేళ్ల కాలంలో రూ.27.95కోట్ల లబ్ధి ప్రత్యక్షంగా, పరోక్షంగా అందిందని చెప్పారు. అనంతరం గడప గడపకు వెళ్లి గత ప్రభుత్వ ఇస్తానన్న హామీలు, జగనన్న నెరవేర్చిన హామీలను ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు ప్రజలకు వివరించి, సంక్షేమ బుక్‌లెట్ అందజేశారు. సర్పంచ్ వల్లభాపురం నిర్మల, పార్టీ నాయకులు అవుతు శేఖరరెడ్డి, వంగా సుధాకరరెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ శంకరరావు, పంచాయతీ కార్యదర్శి అలక నందన, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు 18వ వార్డులో ..

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని 18వ వార్డు సత్యనారాయణటాకీస్ రోడ్డులోని పెరుగు మార్కెట్ వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెరుగు మార్కెట్ సమీపంలోని సచివాలయం వద్ద సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

అన్నివర్గాల అభ్యున్నతికి మళ్లీ జగనే రావాలి..

తెనాలిరూరల్: కులమతాలకు అతీతంగా రాష్ట్రంలో అన్నివర్గాలకు సమ న్యాయం జరిగే సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ద్వారానే సాధ్యమని, ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న అందుకే కావాలని ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం సంగం జాగర్లమూడిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అన్ని వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సమన్యాయం జరుగుతోందని అన్నారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కరపత్రాన్ని గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసిన హామీలతో కూడిన కరపత్రాన్ని అందించి పథకాల గురించి వివరించారు. గ్రామ సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఎండీ ఫరీద్, ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు రెడ్డి శ్రీనివాసరావు, బి.అరుణ్‌కుమార్, యాసిర్ పఠాన్, పాలడుగు సాంబశివరావు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వల్లభాపురంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షుడు పోతిరెడ్డి, ఎంపీపీ పద్మావతి



రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

సహకార వ్యవస్థ బలోపేతానికి చర్యలు

- సంఘాల ద్వారా రైతులకు రుణాలు
- డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి నిర్మల



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

తెనాలిటౌన్: సహకార సంఘాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని రైతులకు సహకార సంఘాల ద్వారా రుణాలు ఇస్తున్నట్లు డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి పి.నిర్మల తెలిపారు. జాతీయ సహకార వారోత్సవాల ముగింపు సందర్భంగా రూరల్ మండలం కొలకలూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) వద్ద సోమవారం సహకార జెండాను డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి నిర్మల ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి సహకార గీతాన్ని ఆలపించారు. అనంతరం కార్యాలయంలో జరిగిన సభకు సొసైటీ సీఈఓ వెంకటకృష్ణారావు స్వాగతం పలికారు. సభలో డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి నిర్మల మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని నెహ్రూ జయంతి సందర్భంగా నవంబర్ 14నుంచి 20 వరకు సహకార వారోత్సవాలను గత 70 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సహకార సంఘాల ద్వారా రైతులకు వివిధ రకాల రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. సహకార సంఘాల ద్వారా జనరిక్ మెడికల్ షాపు, కామన్ సర్వీస్ సెంటర్‌లను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. పెట్రోల్ బంక్ నిర్వహణకు స్థలం చూపినట్లయితే సొసైటీ ద్వారా బంక్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కేంద్రంలో సహకారశాఖను ఏర్పాటు చేసి సహకార వ్యవస్థను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులు పండించిన పంటలను నిల్వ చేసేందుకు మల్టీపర్పస్ గోడౌనును కొలకలూరులో నిర్మించామని చెప్పారు. సొసైటీ చైర్మన్ గంపల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొలకలూరు సొసైటీ ద్వారా రైతులకు రూ.7కోట్ల మేర రుణాలు ఇచ్చామన్నారు. డ్వాక్రా సంఘాలకు రూ.10కోట్లు రుణాలు ఇచ్చామని తెలిపారు. హాఫ్‌పేటలో గోడౌను నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం పనిచేస్తూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పలువురు రైతులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. సబ్ డివిజన్ కో-ఆపరేటివ్ అధికారి టి.శోభన్ బాబు, తెనాలి కార్యాలయ సూపరింటెండెంట్ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ సురేష్‌కుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్‌లు నాగూర్ బాయి, రాజు, ప్రసాద్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు అన్వార్ హుస్సేన్, శ్రవ్య, సొసైటీ సీఈఓ కృష్ణారావు, సొసైటీ డైరెక్టర్లు దాది జ్యోతి, దక్కుమళ్ల నయోమి, రైతు తులాబంధుల చిన్న చిట్టిబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

23న దేవాలయ శిఖర ప్రతిష్టా మహోత్సవం



శిఖర ప్రతిష్టకు సిద్ధమవుతున్న సంగం జాగర్లమూడిలోని వీరాంజనేయస్వామి ఆలయం

తెనాలిటౌన్: రూరల్ మండలం సంగంజాగర్లమూడిలోని సువర్చలా సమేత వీరాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 23న శిఖర ప్రతిష్ఠ మహోత్సవం, మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ పునఃనిర్మాణ పర్యవేక్షకులు కొత్త రమేష్ బాబు, సజ్జ నారాయణస్వాములు గురువారం తెలిపారు. కార్యక్రమ వివరాలను అర్చకుడు వేదాంతం వీబీవీ హనుమాచార్యులు తెలియజేస్తూ ఆలయంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు స్వామివారికి భక్తులచే అభిషేకం జరుగుతుంది. సాయంత్రం 6.30 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం, గ్రామ ప్రదక్షిణ, విశ్వక్షేణ పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ పూజ, అంకురార్పణ, దీక్షధారణ, యాగశాల ప్రవేశం జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం 8గంటలకు హోమాలు జరుగుతాయని, మధ్యాహ్నం 3గంటలకు గ్రామోత్సవం, మహాశాంతి నిత్యహోమాలు జరుగుతాయని తెలిపారు. గురువారం ఉదయం ఆరుగంటలకు పూజలు, నిత్యహోమం, శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం జరుగుతుందన్నారు. అనంతరం శాంతి కల్యాణం, పూర్ణాహుతి, వేద ఆశీర్వచనం, అనంతరం అన్నదానం జరుగుతుందని చెప్పారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రముఖ గాయని తెనాలికి చెందిన శారద చలపతి పర్యవేక్షణలో కోదండ రామస్వామి భక్తబృందం సభ్యులచే అన్నమాచార్య భక్తలహరి కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేక కార్యక్రమాన్ని ఆగమ ప్రవర పరాశరం భోగ శ్రీనివాస మారుతీ వర ప్రసాద్ శిష్య బృందంచే జరుగుతుందన్నారు. గ్రామానికి చెందిన కొత్త సుబ్బయ్యచౌదరి, ఉషారాణి దంపతులచే ఆలయ శిఖర ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి



మారీసుపేట శివాలయంలో ప్రమిదలతో దీపారాధన

తెనాలిటౌన్: కార్తికమాసం సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. మారీసుపేట శివాలయంలో లక్ష ప్రమిదలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగమూరి యుగంధర్ దంపతులు, భక్తులు పూజలు జరిపారు. రామలింగేశ్వరపేటలోని శివాలయంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. ఆలయంలో రామలింగేశ్వరస్వామి వారికి వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గంగానమ్మపేటలోని పాత శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ, రూరల్ గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో మహిళలు, భక్తులు పూజలు నిర్వహించారు. మహిళలు తెల్లవారుజామునుంచే దీపారాధనలు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

దుకాణ యజమానులపై అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు



స్వర్ణ వెంకట మహేశ్వర్(ఫైల్)

తెనాలిరూరల్: స్థానిక చెంచుపేటకు చెందిన యువకుడు స్వర్ణ వెంకట మహేశ్వర్(20) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తాను పనికి వెళ్లే జ్యూస్ షాపులో ఆదివారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఇక్కడి కేఎస్ఎం హైస్కూల్ రోడ్డులో వాటర్ ట్యాంక్ సమీపంలో నివసించే మహేశ్వర్ చెంచుపేట సెంటర్‌లో గుంటూరు నాన్ స్టాప్ బస్సులు ఆగే చోట ఫ్రూట్ జ్యూస్ షాపులో కొంతకాలంగా పని చేస్తున్నాడు. మహేశ్వర్‌కు గత 20 రోజుల క్రితమే వివాహం అవడంతో ప్రస్తుతం సెలవులో ఉన్నట్లు తెలిసింది. అయితే ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో జ్యూస్ షాపు నిర్వాహకులు మహేశ్వర్ ఇంటికి వచ్చి షాపు సర్దాలంటూ అతడిని తీసుకు వెళ్లినట్లు చెబుతున్నారు. షాపులో సామాన్లు సర్దుతుండగా మహేశ్వర్ కరెంటు షాక్‌కు గురైనట్లు తెలుస్తోంది. దీంతో షాపు నిర్వాహకులు అతడిని వైద్యశాలకు తీసుకు వెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఫ్రూట్ జ్యూస్ షాపు ముందు భాగంలో ఇటీవల మరమ్మతులు చేయగా బయట ఉన్న సామగ్రి మొత్తాన్ని సర్దే క్రమంలో అతడు విద్యుత్ షాక్‌కు గురైనట్లు అంతా భావిస్తున్నారు. మహేశ్వర్ మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలో ఉంచారు. అయితే 20 రోజుల క్రితమే వివాహం అవడం, అనుకోని ప్రమాదంలో అతడు మృతి చెందడంతో మృతుడి తల్లి, భార్య సహా కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనపై త్రీ టౌన్ పోలీసులు జ్యూస్ షాప్ నిర్వాహకులు, మృతుడి బంధువులను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు తెలిసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విద్యార్థులకు బహుమతులు అందజేత



గ్రంథాలయంలో బహుమతులు పొందిన విద్యార్థులతో సర్పంచ్ ప్రీతి, హెచ్ఎం నాగేశ్వరరావు



సన్మానగ్రహీతలతో మల్లేశ్వరరావు, ప్రసాద్, తదితరులు

తెనాలిటౌన్: రూరల్ మండల గ్రామాల్లోని శాఖాగ్రంథాలయాల్లో ఈ నెల 14నుంచి నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వారం రోజుల పాటు జరిగి వివిధ అంశాలలో జరిగిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కొలకలూరులోని శాఖాగ్రంథాలయంలో గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి, జడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, గ్రంథాలయాధికారిణి కడియాల సుజాతలు విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివర్ధిని స్కూల్ కరస్పాండెంట్ నాగరాజు, న్యూ చైతన్య స్కూల్ హెచ్ఎం సంధ్య, పద్మరాజా స్కూల్ డైరెక్టర్ వెంకయ్య, ఉపాధ్యాయులు ఎం.అన్నారావు, పూర్ణచంద్రరావు, వెంకటేశ్వరరావు, ఏస్తేరు, విజయ, కె.ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

- నందివెలుగులోని శాఖాగ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రామ సర్పంచ్ ధూళ్ళిపాళ్ళ పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారిణి బొల్లు మాధవి పర్యవేక్షించారు.

పుస్తక ప్రదర్శన..

తెనాలిఅర్బన్: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో సోమవారం పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రవీంద్రనాథ్, కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సుగుణ, డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ బి.వనజ, తదితరులు పాల్గొన్నారు.

- నెహ్రూరోడ్డులోని జిల్లా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం బాలబంధు శ్రీ సమత అవార్డును నూతలపాటి నాగేశ్వరరావుకు, మధుర కవి నాళం కృష్ణారావు అవార్డును డాక్టర్ బెజ్జంకి జగన్నాథచార్యులకు, ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ అవార్డును పిరాట్ల జయలక్ష్మికి, డాక్టర్ వెలగా వెంకటప్పయ్య అవార్డును పి.విజయశ్రీకి అందజేసి ఘనంగా సన్మానించారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, పావులూరి శ్రీనివాసరావు, డీవీఆర్ ప్రసాద్, గ్రంథాలయాధికారి కె.రమాదేవి పాల్గొన్నారు.

తెనాలిరూరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. తెనాలి మండలం పెదరావూరులోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అభినందించి బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటఅప్పారావు, టి.వెంకటకృష్ణ, విశ్రాంత గ్రంథాలయాధికారి మొవ్వ సుబ్బారావు, కె. చంద్రమౌళి, కె. శివన్నారాయణ, పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి ఎ. రాఘవేంద్రరావు పర్యవేక్షించారు. మండలంలోని సంగంజాగర్లమూడి శాఖా గ్రంథాలయాన్ని గ్రంథాలయ శాఖ ఉప సంచాలకుడు షేక్‌పీర్ అహ్మద్ ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రంథాలయాధికారి జమ్ముల వెంకటేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాలల హక్కులపై అవగాహన



తెనాలిరూరల్: బాలల హక్కుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఫతే అలీ బేగ్ అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల ముగింపు, బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా తెనాలి రైల్వేస్టేషన్‌లో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గుంటూరు రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ బృందం సభ్యుడు వాకా లక్ష్మణ్‌నందన్ బాలలకు ఎక్కడైనా ఇబ్బంది కలిగితే వెంటనే 1098 నంబరుకు కాల్ చేసి సమాచారమందించాలని సూచించారు. స్టేషన్ మైనేజర్ టీవీ రమణ, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐలు ఎం.శివరామకృష్ణయ్య, ఆర్వీ శివారెడ్డి, ఎ.జైపాల్, రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యులు సావిత్రి, చెల్సియా, భార్గవి, ఆర్‌పీఎఫ్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

కేఎల్‌యూలో జాతీయస్థాయి అధ్యాపకుల సదస్సు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో జాతీయస్థాయి అధ్యాపకుల సదస్సు సోమవారం నిర్వహించారు. నిర్వాహకులు డాక్టర్ ఎస్.అరుణ మేత మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు ఏఐసీటీఈ ఆర్థిక సహకారం అందించినట్లు చెప్పారు. సదస్సుకు రెండు తెలుగు రాష్ట్రాలలోని పలు విద్యా సంస్థల నుంచి అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. వరంగల్ ఎన్ఐటీ నుంచి ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.సతీష్, డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ కె.తుంగరాజు, రూర్కీ ఐఐటీ నుంచి డాక్టర్ కౌశిక్ పరిదా, కడప యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఎం.వి.శంకర్, హైదరాబాద్ నానోసోల్ నుంచి డాక్టర్ ఎం.శంకర్‌రావు, ఎండీఎఫ్ ట్రానిక్స్ సీఈఓ రామకృష్ణ ప్రసంగించినట్లుచెప్పారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డీన్ ఆర్ అండ్ డీ డాక్టర్ జయకుమార్‌సింగ్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్, ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వివేకానందన్ వెంకటేశ్వరన్, అసోసియేట్ డీన్ అకడమిక్స్ డాక్టర్ అరవిందన్ అళగర స్వామి పాల్గొన్నారు.

కార్తిక సందడి



శివాలయంలో స్వామి వారి దర్శనానికి క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

మంగళగిరి: నగరంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి(శివాలయం)లో కార్తిక సందడి నెలకొంది. తొలి సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి శివాలయంలో కార్తిక దీపాలు వెలిగించి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక, సభ్యులు అద్దంకి వెంకటేశ్వర్లు, కొల్లి మునలారెడ్డి, కొల్లి బాబూరావు భక్తులకు ఏర్పాట్లును పర్యవేక్షించగా ఆలయ ప్రధాన అర్చకులు తెలకపల్లి మహేష్ శర్మ పూజలు నిర్వహించారు.

జనవరి 3,4 తేదీల్లో ఏఎన్‌యూలో జాతీయ సదస్సు



ఏఎన్‌యూ: నాగార్జున యూనివర్సిటీలోని మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను సోమవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు మాట్లాడుతూ 'భారతదేశంలో నిజమైన సమగ్ర అభివృద్ధి దిశగా: మహాత్మా జ్యోతిరావు పూలే భావజాలం , సామాజిక ఆచరణ ఔచిత్యం' అనే అంశంపై వచ్చే జనవరి 3, 4 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సులో పరిశోధనా పత్రాలు సమర్పించే వారు డిసెంబరు 15వ తేదీలోగా పంపాలని సూచించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి, బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఆచార్య కె. మధుబాబు, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, మహాత్మా జ్యోతిరావ్ పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.